క్లుప్తంగా

మునగ సాగు.. లాభాలు బాగు



రైతులతో మాట్లాడుతున్న సురేందర్

పాములపాడు: మునగ పంట సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా అంబుడ్స్‌పర్సన్ సురేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రుద్రవరం గ్రామంలో మునగ పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఎకరా పంటకు వారానికి రూ.10 వేల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. మొక్కల వద్ద పాదులు తీసి ఎరువులు వేసుకుంటే ఎక్కువ దిగుబడి వస్తుందని సూచించారు. ఆయనతో పాటు ఏపీఓ విమలమ్మ, జేఈ రమేష్‌నాయుడు, టీఏ శ్రీధర్, ఎఫ్ఏ అనితమ్మ ఉన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం



పౌష్టికాహార కిట్లును అందజేస్తున్న వైద్య సిబ్బంది

పాములపాడు: మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు శుక్రవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ మాట్లాడుతూ.. సెంట్రల్ పవర్ గ్రిడ్ సంస్థ సహకారంతో మండలంలోని 23 మందికి రూ.3 వేల విలువ చేసే పౌష్టికాహార కిట్లు (నూనె, రాగిపిండి, శనగ విత్తనాలు, కందిబేడలు) అందజేసినట్లు తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం, వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితే త్వరగా కోలుకోవచ్చని పేర్కొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఉపాధ్యాయులు

నందికొట్కూరు రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని గణిత ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లి గ్రామంలో 10వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం పాఠశాలలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సర్పంచ్ దామోదరరెడ్డి, ఉపాధ్యాయులు రఫి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



చంద్రశేఖర్ నాయక్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. బదిలీపై వెళుతున్న ఆయన్ను కార్యాలయ సిబ్బంది శుక్రవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని శాఖల అధికారులు తనకు ఎంతగానో సహకారం అందించారని తెలిపారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సిబ్బంది ఆయన్ను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఆర్ఐ జహంగీర్ బాషా, వీఆర్వోలు బాబుమియా, రామసుబ్బయ్య, అశోక్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం

జూపాడుబంగ్లా: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయించిన 20 మందికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. మండలం వ్యాప్తంగా 11 లేఅవుట్లలో 1,432 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా వారిలో ఇప్పటి వరకు 20మందికి రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. మిగిలిన వారికి త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసివ్వనున్నట్లు తెలిపారు.

వేంపెంటలో డీఎస్పీ పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి పల్లెనిద్ర చేశారు. రానున్న ఎన్నికల గురించి విధివిధానాలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో రాత్రి బస చేశారు.సర్పంచ్ మాణిక్యమ్మ, సీఐ నాగభూషణం, ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష

- నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- టీడీపీ వార్డు సభ్యుడు వైఎస్సార్‌సీపీలోకి చేరిక



మాబాషాకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, సుధీర్

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీకి సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా నిలుస్తాయని రాష్ట్ర శాప్ చైర్మన్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. శుక్రవారం నందికొట్కూరు మార్కెట్ యార్డులో సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు సభ్యుడు మాబాషా వైఎస్సార్‌సీపీలో చేరారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ.. సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ కార్యకర్తలకే పథకాలు ఇచ్చారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని చెప్పారు. నవరత్నాల పథకాలతో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందని చెప్పారు. విద్య వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం అమలు చేశారని తెలిపారు. జగనన్న పాలనలో మంచి జరిగితేనే ఓటు చేయ్యండి అని సీఎం వైఎస్ జగనన్న ధైర్యంగా అడుగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మహబూబ్‌బాషా, ముసలిమడుగు ఉప సర్పంచ్ నాగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆజాం, పెద్ద లింగస్వామి, మౌలానా సులేమాన్, నాగరాజు, సత్యాలు, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధం

జూపాడుబంగ్లా: త్వరలో జరగనున్న ఎన్నికల సమరానికి సిద్ధమంటూ నందికొట్కూరులో నిర్వహించిన సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నేతలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. జూపాడుబంగ్లాకు చెందిన సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, తర్తూరు నాగిరెడ్డి, మండ్లెం తోకలకృష్ణారెడ్డి, పారుమంచాల జెడ్పీటీసీ సభ్యుడు పోచాజగదీశ్వరరెడ్డి, పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, తరిగోపుల కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, 80బన్నూరు మద్దిలేటిరెడ్డి, తాటిపాడు కోసిక తిరుమలేశ్వరరెడ్డి, తంగడంచ గోకారి, దినేష్, భాస్కరాపురం గోవిందు ఆధ్వర్యంలో బైక్‌లు, ఆటోలు, కార్లలో భారీగా తరలివెళ్లారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని నినాదాలు చేశారు.



జూపాడుబంగ్లా నుంచి సభకు తరలివెళ్తున్న పార్టీ నేతలు



పగిడ్యాల: బైక్‌లపై తరలివెళ్తున్న అభిమానులు

సిద్ధం సదస్సుకు పోటెత్తిన జనం

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సిద్ధం సదస్సుకు పార్టీ నాయకులు, అభిమానులు పోటెత్తారు. పగిడ్యాల మండలంలోని ఎంఎస్. ఘణపురం, తూర్పు, పడమర ప్రాతకోట, లక్ష్మాపురం, పగిడ్యాల, బీరవోలు, ఆంజనేయనగర్, సంకిరేణిపల్లె, వనుములపాడు, పాత, కొత్త ముచ్చుమర్రి, నెహ్రూ నగర్, పీకే ప్రాగటూరు, అర్లపాడు తదితర గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రహదారులన్నీ జై జగన్, జై సిద్ధార్థరెడ్డి నినాదాలతో మారుమోగాయి.

ఎమ్మెల్యే శిల్పా హయాంలోనే మండలాభివృద్ధి

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హయాంలోనే వెలుగోడు మండలం అభివృద్ధి చెందిందని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని జగనన్న కాలనీ మెయిన్ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. పనులను పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చైతన్య, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

మహాశివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు



పనులను పరిశీలిస్తున్న చైర్మన్, ఈఓ

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీశైలం ఆలయ ఈఓ



కలెక్టర్‌కు స్వామివారి శేషవస్త్రం, క్యాలెండర్‌ను అందజేస్తున్న పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: నంద్యాల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాసులుని శ్రీశైలం దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదం, క్యాలెండర్‌ను అందజేశారు. ఆలయంలో జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్‌తో చర్చించారు.

625 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలకు బారులు తీరిన గ్రామస్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 625 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. వారిలో 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి కర్నూలుకు రెఫర్ చేశారు. ఎంపీడీఓ నూర్జహాన్, సర్పంచ్ శ్యామల, వైద్యులు సభా, జక్కీ, పునేశ్వరరావు ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చక్కటి వేదిక లోక్ అదాలత్



పోలీసు అధికారులతో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి తేజాసాయి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు కోర్టుల సముదాయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్చి 9వ తేదీ నిర్వహిస్తున్న మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఏపీపీ బాబు రాజేంద్రప్రసాద్, ఆత్మకూరు ఎస్ఐలు కృష్ణమూర్తి, వెంకటనారాయణరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

మహానందిలో వేడుకగా పల్లకీ సేవ



పల్లకీపై విహరిస్తున్న స్వామివారు

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. గణపతి పూజ, పుణ్యాహవచనం, మంగళ హారతి, ప్రత్యేక అలంకరణ చేశారు. పల్లకీపై మహానందీశ్వరుడిని కొలువుదీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ధ్వజస్తంభం వద్ద స్వామి, అమ్మవార్లకు హారతులు ఇవ్వగా భక్తులు దర్శించుకుని ఓం నమో మహానందీశ్వరా అంటూ ప్రణమిల్లారు.

అడవి పంది మాంసం స్వాధీనం

మహానంది: మహానంది మండలం ఎంసీఫారం, గోపవరం గ్రామ సమీపంలో అడవి పంది మాంసాన్ని వండుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు డీఆర్ఓ హైమావతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. గోపవరం గ్రామానికి చెందిన నల్లబోతుల మధు సాగు చేస్తున్న మొక్కజొన్న పంట చుట్టూ ఏర్పాటు చేసుకున్న కంచెలో విద్యుత్ సరఫరా ఉండడంతో అడవి పంది మృతిచెందినట్లు చెప్పారు. మధుతో పాటు రుద్రవరం మండలం పందిర్లపల్లి గ్రామానికి చెందిన మల్లేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజారోగ్యమే జగనన్న సురక్ష లక్ష్యం

మహానంది: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని గాజులపల్లె వైద్యాధికారి దినేష్ కుమార్ రెడ్డి తెలిపారు. గాజులపల్లె సచివాలయం-2లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 511 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. సర్పంచ్ గడ్డం చంటి, వైఎస్సార్‌సీపీ నేత కొండా మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత



మద్యం, నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

నందికొట్కూరు: తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు పట్టణ సీఐ ప్రకాశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మల్యాల క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేశామన్నారు. ఓ వ్యక్తి పోలీసులనుచూసి ఆటోలో పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి 23 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

25 మద్యం బాటిళ్లు స్వాధీనం

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో ఓ మహిళ ఇంట్లో చేపట్టిన సోదాల్లో 25 మద్యం బాటిళ్లు లభ్యమైనట్లు ఎస్ఐ జయశేఖర్ శుక్రవారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో సోదాలు నిర్వహించామని చెప్పారు. మహిళపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం పట్టివేత

శ్రీశైలం:క్షేత్ర పరిధిలో మద్యం విక్రయిస్తున్న రమేష్, బ్రహ్మయ్య, రామయ్యలను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ప్రసాదరావు, ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం కొత్తపేటలో రెండు కేసుల మద్యం బాటిళ్లు, పాతాళగంగ వద్ద 12 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పంట నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

కొత్తపల్లి: రబీ సీజన్‌లో పంట సాగుచేసిన రైతులు ఈనెల 15వ తేదీలోగా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ అన్నారు. శుక్రవారం నందికుంట గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి కె.మహేష్ ఆధ్వర్యంలో రైతులతో సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నమోదుతోపాటు ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి పథకాలు అందుతాయన్నారు. అదే విధంగా జొన్న పంటకు మద్దతు ధర రూ.3180తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు పంటలను అమ్ముకోవద్దని సూచించారు. పీఎం కిసాన్ 16వ విడత నిధులు త్వరలోనే రైతుల ఖాతాలో జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ మండల చైర్మన్ పెద్దపుల్లారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

పాములపాడు: నులిపురుగుల నివారణకు మండలంలోని 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కరుణసాగర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డాక్టర్ గులాబ్‌షా, ఎంఈఓ బాలాజీనాయక్‌లకు మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 1–2 ఏళ్ల పిల్లలు 2,348, పాఠశాలల్లో 5,138, జూనియర్ కాలేజీల్లో 143, బయట ఉన్న వారు 55 మంది సహా మొత్తం 7684 మంది పిల్లలు ఉన్నట్లు వెల్లడించారు. వీరి కోసం 9 వేల మాత్రలు వచ్చాయని తెలిపారు. డీ వార్మింగ్ డే సందర్భంగా ఈ నెల 9, 16వ తేదీల్లో మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, సూపర్‌వైజర్ మద్దయ్య పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే జైలుకే



ప్రజలకు సూచనలు ఇస్తున్న సీఐ శివకుమార్‌రెడ్డి

మహానంది: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలం భోజనం గ్రామంలో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎవరైనా ఘర్షణలకు దిగితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామంలో అందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. మహిళలను వేధిస్తే పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్ఐ మల్లికార్జున ఉన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నరేష్ కృష్ణ

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలం ఎంపీడీఓగా కేఎన్ నరేష్‌కృష్ణ శుక్రవా రం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న శోభారాణి ఎన్నికల బదిలీల్లో భాగంగా అనంతపు రం జిల్లాకు వెళ్లారు. ఆమె స్థానంలో శ్రీసత్య సాయి జిల్లా చిలమత్తూరు మండలం ఎంపీడీఓగా పని చేస్తున్న నరేష్ కృష్ణ వచ్చారు. ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు.

మిడ్తూరు ఎంపీడీఓగా గంగావతి

మిడ్తూరు: స్థానిక ఎంపీడీఓగా గంగావతి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న జీఎస్ఎస్ రెడ్డి బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా చెన్నకొత్తపల్లి మండలానికి చెందిన గంగావతి ఇక్కడికి వచ్చారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



80బన్నూరులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

జూపాడుబంగ్లా: మండలంలో పింఛన్ల పంపిణీ 93.23 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. రెండో రోజు శుక్రవారం సాయంత్రం నాటికి మండలం వ్యాప్తంగా 5,153 పింఛన్లకుగాను 4,804 పింఛన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో జూపాడుబంగ్లా మండలం 14వ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. మిగిలిన 349 పింఛన్లను శనివారం సాయంత్రం నాటికి పంపిణీ చేసి వందశాతం పూర్తి చేయాలన్నారు.

పాములపాడులో 79.9 శాతం

పాములపాడు: మండలంలో 79.9 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కరుణసాగర్ తెలిపారు. మొత్తం పింఛన్లు 5964 మందికి గాను 4765 మందికి పంపిణీ చేశామన్నారు. ఇంకా 1199 మందికి పంపిణీ చేయాల్సి ఉందన్నారు. త్వరితగతిన మిగతా వారికి పంపిణీ చేయాలని పేర్కొన్నారు.

మహాసభను విజయవంతం చేద్దాం

మిడుతూరు: విజయవాడలో ఈ నెల 4వ తేదీ జరగనున్న గ్రామీణ వైద్యుల(ఆర్ఎంపీ) రాష్ట్ర మహాసభను విజయవంతం చెద్దామని గ్రామీణ వైద్యుల సమాఖ్య తాలుకా ఇన్‌చార్జ్ ఎంఎం బాషా అన్నారు. ఆర్ఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రతినిధులు కృషి చేస్తారని చెప్పారు.

శ్రీశైలం సమన్వయకర్తగా సికిందర్

శ్రీశైలం ప్రాజెక్ట్: జైభారత్ నేషనల్ పార్టీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్తగా సున్నిపెంటకు చెందిన సయ్యద్‌మహమ్మద్ సికిందర్‌బాషాను నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. సమసమాజ నిర్మాణం కోసం పార్టీ ఆవిర్భవించిందని.. ఆ మేరకు తాను పనిచేస్తానని సికిందర్‌బాషా తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహానంది: బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరులోని శ్రీలక్ష్మీ చెన్న కేశవస్వామి దేవస్థానం, పార్నపల్లెలోని శ్రీవీరభద్రస్వామి ఆలయాల ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ వచ్చిందని ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతునగరంలోని జిల్లా దేవదాయ శాఖ కార్యాలయానికి దరఖాస్తులు పంపించాలన్నారు.

విద్యుత్ మోటర్ల చోరీ

వెలుగోడు: పట్టణంలోని ప్రధాన రహదారి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న సాయి కాంప్లెక్స్, పాతబస్టాండ్‌కు వెళ్లే దారిలోని తాజ్ గార్మెంట్స్ వద్దనున్న మరో కాంప్లెక్స్‌లో విద్యుత్ మోటర్లు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితులు శుక్రవారం ఎస్ఐ భూపాలుడుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. రాత్రి వేళల్లో పట్టణంలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లేబర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా పరిధిలోని అన్ని దుకాణాలకు లేబర్ ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నిసా బేగం తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో లేబర్ ధ్రువీకరణ పత్రం గురించి వ్యాపార సంఘాల నాయకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దుకాణాల యజమానులు తప్పనిసరిగా తమ వివరాలు మీసేవలో నమోదు చేసి లేబర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ఈ నెల 29వ తేదీలోగా పొందాలని సూచించారు.

వేలంలో 40 వేల ఆదాయం

కొత్తపల్లి: మండలంలోని కొలను భారతీ క్షేత్రంలో దుకాణాల నిర్వహణ కోసం నిర్వహించిన వేలంలో రూ.40 వేల ఆదాయం లభించింది. 2024–2025 ఏడాదికి గాను నంద్యాల దేవదాయశాఖ తనిఖీ అధికారి శేఖర్‌కుమార్ అధ్యక్షతన ఆలయ ప్రాంగణంలో శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. అమ్మవారి ఫొటోలు అమ్ముకునేందుకు రూ.15,000, బెల్లం చెరుకులు అమ్ముకోవడానికి రూ.8000, హోటల్ నిర్వహణ కోసం రూ.17,000 వచ్చాయని అధికారులు తెలిపారు.

మద్యం కేసులో రిమాండ్

కొత్తపల్లి: సారా విక్రయిస్తున్న మహిళను రిమాండ్‌కు తరలించినట్లు ఆత్మకూరు ఎక్సైజ్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. నందికుంట గ్రామంలో రాయ లింగమ్మ తన ఇంటి వద్ద సారా విక్రయిస్తోందనే సమాచారంతో గురువారం దాడులు చేశామన్నారు. 5 లీటర్ల సారా పట్టుబడిందన్నారు. శుక్రవారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. కాగా తమ వద్ద అర లీటరు సారా మాత్రమే దొరికితే ఎక్సైజ్ అధికారులు 5 లీటర్ల సారా దొరికిందని అన్యాయంగా కేసు నమోదు చేశారని నిందితురాలి కూతురు మల్లేశ్వరి వాపోయింది.

ఉపాధి పనులతో ఆర్థిక భరోసా

మహానంది: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఉపాధి లభించి ఆర్థిక భరోసా కలుగుతోందని బండిఆత్మకూరు ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి తెలిపారు. ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బండిఆత్మకూరు ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హనీఫ్‌ఖాన్, ఏపీఓ వసుధారెడ్డి పాల్గొన్నారు.

చిరుత దాడిలో మేక మృతి

కోసిగి: స్థానిక రంగప్ప గట్టు సమీపంలోని తమ్మనగేని కృష్ణకు చెందిన గొర్రెల మందపై గురువారం రాత్రి చిరుత దాడి చేసింది. అందులో నుంచి ఒక మేకను పట్టుకుని పరుగులు తీస్తుండగా అక్కడున్న కుక్కలు అరవడంతో గొర్రెల కాపరులు కేకలు వేయడంతో మేకను వదిలేసి చిరుత పరారైంది. అయితే అప్పటికే మేక చనిపోయింది. గత ఐదు రోజుల నుంచి మూడు మేకలు పట్టుకెళ్లిందని వారు పేర్కొన్నారు. విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేయడంతో పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మృతి చెందిన మేకకు పోస్టుమార్టం చేశారు.

పలు మండలాలకు నూతన తహసీల్దార్లు

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా తహసీల్దార్‌గా కె.బాబురాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న పుల్లయ్యయాదవ్ తన రెండేళ్ల శిక్షణ కాలం పూర్తికావడంతో మాతృసంస్థ సీసీఎల్ఏకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా గుడిపాల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బాబురాజేంద్రప్రసాద్ ఇక్కడికి వచ్చారు. ఈయనతో పాటు పగిడ్యాల తహసీల్దార్‌గా వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన జీవీ నానగేశ్వరరావును నియమించారు. కొత్తపల్లి తహసీల్దార్‌గా వైఎస్సార్ జిల్లా మైలవరం తహసీల్దార్ డి.తిరుపతయ్య, అలాగే నందికొట్కూరు తహసీల్దార్‌గా వైఎస్సార్ జిల్లా గోపవరం తహసీల్దార్ జి.రవీంద్రారెడ్డి, మిడ్తూరు మండలానికి తిరుపతి జిల్లా, రామచంద్రాపురం నుంచి జీసీ వెంకటేశ్వర్లును నియమించారు.

ఆర్థిక సాయం

మహానంది: కష్టాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు నడిపన్న, కొత్తబోయ మల్లికార్జునలకు శుక్రవారం రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఏపీయూఎస్ ఆవిర్భావ దినోత్సవం

వెలుగోడు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆపస్ రాష్ట్ర సహకోశాధికారి కృష్ణార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, నరసింహులు, జిల్లా మీడియా కార్యదర్శి సురేష్ బాబు ఆపస్ జెండాను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఏపీయూఎస్ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగసుబ్బానాయక్, వెంకటరమణ, నాయకులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసాచారి, నాగలింగేశ్వరమ్మ, శివమ్మ, ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.